

# (ప్ర)పంచతంత్రం

వి. ప్రసాదరావు

జనరల్ ఆస్పత్రిలో ..

ఎక్యూట్ ఎపెండిసైటిస్ పేషెంటు పేరమ్మ పేరంటాల్లో కలిసిపోయింది. ఆవిడకు నిండా పాతిక దాటకమునుపే నూరేళ్లు నిండిపోయినయ్! ఆవిడకు అర ఎకరం భూమి, అరడుగు ఎత్తున గూనీ ఉన్నాయి. సొంతూరు సొంతాపురంలో సాదా సీదా ఇల్లొకటి ఉంది తప్ప, మరేమీ లేదు. తల్లీ తండ్రీ పోయారు. మేనమామ వరస చుట్టమొకడున్నాడు తప్ప మరెవ్వరూ లేరు.

ఆ చుట్టం పేరు రంగులు! రంగులు టాక్సీని బేరమాడుతున్నాడు గంటనుంచీ. ఎయ్యి రూపాయలు సవారీకి మరో వంద నైటెలవన్సు ఇస్తేనే తప్ప కుదరదన్నాడు టాక్సీవాలా. అక్కడున్న ఆ నలుగురూ అంతేనన్నారు.

**" ... నువ్విచ్చే ముష్టి మూడొందలికి మూడు టైర్ల బండి కాకండా ఆర్టయిర్ల బండీ, నాలుగు టయిర్ల బండీ వస్తాదనుకున్నావా ... సాల్లాల్లేవయ్యా! ... ఎల్లు ... ఎల్లు ... పని సూడు ముందు!"**

"అయితే పొండి ... తెల్లారనే నాటు బండొస్తాది ఊర్నించి ... ఆళ్లే తీస్కుపోతరు!" అని చుట్ట ముట్టించాడు రంగులు.

మరో ఐదు నిమిషాలు గుసగుసలాడుకుని వంద తగ్గించారు వాళ్లు.

ఐదొందలకు తగ్గమన్నాడు రంగులు. టాక్సీవాళ్లు వెళ్లిపోయారు నాటు రంగుల్ని నాటు నాటుగా తిట్టి. వాళ్లు వెళ్లిన అయిదు నిముషాలకు వచ్చాడు సింవాచెలం.



సింవాచెలం దూరాన్నించే అంతా గమనించాడు.

"ఆరొందలీ తీస్కుపోతా...!" అన్నాడు బీడీ ముట్టించి.

"వద్దులే, నాటు బండొస్తాది."

"ఏయ్ ... ఏ వూరు మల్లి ... శవమనుకున్నవా, సింతపండు మూటనుకున్నావా ... పోలీసోళ్లు బొక్కలో తోసేగల్రు!"

రంగులు కొంచెం భయపడ్డాడు 'పోలీసు' శబ్దానికి. టాక్సీవోళ్లు తగ్గుతారు కదాని అబద్దమాడాడు గానీ, నిజానికి వూర్నుంచి ఏ బండీ రాదు. ఓ వేల వచ్చిందనుకున్నా దానిమీద తీస్కుపోవాలంటే పోలీసులతో పెద్ద పేసీయే గావాల మరి...

"ఏంటాలోసన...?"

"మూడొందలిస్తా."

సింవాచెలం ఓ క్షణం ఆలోచించాడు. "అయితే ఎడ్రాసు సీటీ ఇయ్యి. నువ్వు రావడం కుదర్దు. వస్తే ఎగస్ట్రా వందవుతుంది."

"ఏటీ ... నేన్రాకండానే శవమెుకటే తీస్కుపోతావా?"

"నువ్వూ శవంగా మారి వస్తానంటే అబ్బెంతరం లేదు."

రంగులు దడుచుకున్నాడు. వాడి శవం జోక్ని తిట్టుకున్నాడు. రెండు నిమిషాలాలోచించాడు. "సరే, రెండొందలిస్తా! శవం జాగర్తగా ఇంటికి చేరిందంటే ఆ బేలన్సు డబ్బులిచ్చేస్తా."

"కుదర్దు. పుల్లెమవుంట్ ఇప్పుడే ఇయ్యి. శవం జాగర్తగానే ఇంటికి సేరతాది ..."

"ఏమో... నువ్వు సేర్సకపోతే?"

"సూడ్నాయుడూ ...!" గొంతు సవరించుకున్నాడు సింవాచెలం గట్టిగా దమ్ము లాగి మెల్లగా వదులుతూ..

"ఈ సెవం గురించి ఇంత ఇంట్రెస్టు ఇంత రాత్రేల నువ్వొక్కడివే వడుతున్నావంటే అక్కడే తెల్సిపోయింది నీ కెంత బెనిఫిట్టుందో ... మరదంతా ఎల్లుర్లో కొచ్చేసి పేవర్లో కెక్కేసినాదంటే ..." సాగదీసి అర్థోక్తిలో ఆగిపోయాడు.

రంగులికర్థం కాలేదు ఎల్తురేంటో, పేవర్లేంటో ... ఈ గూనిగుంటకు కర్మకాండలు జరిపించేస్తే, ఆ పాత ఇల్లు, ఎకరం భూమీ సొంతం చేసేసుకోవచ్చు! మళ్లీ ఈ సొన్సు ఎవరయినా కొట్టేస్తే తంటా ... అల్లతోటీ పేసీ ... ఆ సంగతి మాత్రం గుర్తొచ్చి సింవాచెలంకు 'ఎస్' కొట్టాడు.

సింవాచెలం బీడీని నేలక్కొట్టి బండిని తెచ్చాడు.

రంగులు ఆశ్చర్యపోయాడు. "ఏంటీ... ఈ బండ్లోనా?"

"ఏం మనిషివయ్యా ... సెవం సవారీకి నువ్విచ్చే ముష్టి మూడొందలికి మూడు టైర్ల బండి కాకండా ఆర్టయిర్ల బండీ, నాలుగు టయిర్ల బండీ వస్తాదనుకున్నావా ... సాల్లాల్లేవయ్యా ... ఎల్లు ... ఎల్లు ... పని సూడు ముందు!" కసిరాడు సింవాచెలం.

మరో పదినిముషాలకు ఆటో ఎక్కింది శవం! శవానికి సీటుకు సైట కొంగు ముడేశాడు సింవాచెలం. ఎడ్రస్ చీటీ ఇచ్చాడు రంగులు.

శవం కదిలింది!

ఆస్పత్రిలో కర్చు ఆరొందలు ... వార్డు బోయ్కి, శవాల గది మనిషికీ సెరో వందా ... జమా ఖర్చులు గుణించుకుంటూ హైవే రోడ్డుకు దారితీశాడు రంగులు ఏ లారీనో అందుకోవచ్చని.

000

సింవాచెలం అడ్డరోడ్డు జంక్షన్ దగ్గర చెట్టు చాటున బండి ఆపాడు. అక్కడ మినుకు మినుకు మంటున్న ఓ పాకలో జోగుతున్న జోగుల్ని జెల్లకొట్టి లేపాడు. అక్కడ చెక్క అరలో దాక్కున్న వాటిలో రెండున్నర పేకట్లను అందుకుని కొరికి అందులోనిది నోట్లో కుమ్మరించుకుని గుటక వేశాడు. జోగులు డబ్బడిగాడు.

"సెత్ నీ యాల! ఏట్రా ఇది ... దీనికన్నా పిక్కసోడా నయెం ... ఏంటో పెవంచికంలో అన్నీ కలితీలే!" స్పాట్ కిక్ ఇవ్వని సారామీద మండిపడిపోయాడు సింవాచెలం.


జోగులు వెనకనుంచి అరుస్తున్నాడు సింవాచెలం చెల్లెల్ని తిడుతూ.

"అరువు పద్దెయ్రా ఆడార్నాకొడకా!" అని తిట్టి ఇంకా కిక్కివ్వని మందుపై అసంతృప్తితో జోగులు తల్లీ... చెల్లి శీలాన్ని పబ్లిక్ ప్రోపర్టీలో కలుపుతూ నిష్క్రమించాడు.

000 000 000

బండి జోరుగా పోతోంది. సింవాచెలం కొంచెం బాధపడ్డాడు. జోగులుగాడి మీద తొందరపడి నింద వేసినందుకు. 'సరుకు' సురుకు మంటున్నాదిప్పుడు! సింవాచెలం నాలుకనీ,






పెదాల్ని చప్పరించుకున్నాడు.

చిట్టచీకటిని చీల్చుకుంటూ 'అరవై'లో పరుగెడుతోంది బండి! ఈ లెక్కన మరో పావుగంటలో వూర్ను సేరిపోద్ది బండి ... అనుకుంటున్న సింవాచెల్లం మదిలో తళుక్కున సెంద్రమ్మ కదిలింది! నెల పైనే గావాల అయింది సెంద్రమ్మని పరామర్సించి. రిటను జర్నీల దానింటికే బండి తిప్పాల ... లొట్టలేసి మళ్లీ చప్పరించుకున్నాడు నాలుకనీ పెదాల్ని.

ముంచుకొచ్చే నిద్రనీ, ఊపేసే కైపునీ బలవంతాన అదుపు చేసుకుంటున్న సింవాచెలం ఎందుకో ఉలిక్కిపడ్డాడు ... గభాల్న వెనక్కి చూశాడు.

గుండె ఢాం మంది! వెనుక సీటు ఖాళీ!

కైపు దిగిపోయింది ...

మత్తు వదిలిపోయింది ...

బండి వెనక్కి తిరిగింది ... డెబ్భయ్‌లో పరుగుతీసింది!

రోడ్డు మీదకి కళ్లు చిట్లించి చూస్తున్నాడు సింవాచెలం. ఓ క్షణం వాచీని చూశాడు. పావుతక్కువ నాలుగు.

దూరంగా హెడ్‌లైట్లు కళ్లల్లో చురుక్కుమన్నాయ్!

ఆ వెల్తుర్లో ... అదేంటిది ... అది ... అది ఓర్నాయనో పెద్దబండే గావాల ... ఓర్నాయనోయ్ ... అరె ... ఏటా స్పీడు ... గుండె అదిరిపోయి ఆవిరయిపోయింది సింవాచెలానికి. ఆ క్షణంలో ఏదో మెరుపు మెరిసినట్టూ ... పిడుగు పడినట్టూ తాను చస్తూ ఓ కేక పెట్టినట్టూ అనుకున్నాడు.

లారీ దూసుకుపోయింది!

చీకటి కమ్మిన కళ్లకి కొద్ది కొద్దిగా కనిపిస్తోంది....

రోడ్డు మీద ఉన్న ఆకారం స్పష్టమయ్యింది...! అది నజ్జునజ్జుగా ఉంది ... పరమ భయంకరంగా ఉంది ... చూస్తూనే చావుకేక పెట్టి భళ్లున వాంతి చేసుకున్నాడు సింవాచెలం.

ఓ క్షణం తెలిసింది కాదు ఏం చేయాలో .. తర్వాత తెలిసింది ఏం చేయాలో ...పది నిముషాల్లో లారీని ఓవర్‌టేక్ చేసింది ఆటో! అప్పటికే లారీ ఆగి వుంది రైల్వే క్రాసింగ్ గేటు మూసి ఉన్న కారణంగా.

అక్కడ ఆ లారీకి ముందువైపు మరో రెండు లారీలు ... మరో రెండు ఇతర బళ్లూ ఆగి ఉన్నాయి.

సింవాచెలం కళ్లెర్రజేశాడు, లారీ డ్రైవరుమీద. లారీ నంబరు రాసుకున్నాడు. ఆ డ్రైవరు ముందు గదమాయించినా మళ్లీ తన జైలు కథ గుర్తొచ్చి వణికిపోయాడు. దాన్ని పసికట్టే మరింత వణికించాడు సింవాచెలం.

లారీ డ్రైవరు పులిరాజు మూడేళ్లక్రిందట ఒక ఓనర్ దగ్గర డ్రైవరు మాత్రమే. లైసెన్సు లేని ఓనరు కొడుక్కు ఓ రోజు సరదా పుట్టి బండి తోలాడు. ఆ కొత్త బండి ఇద్దరాడ కూలీల్ని బలి తీసుకుంది. తండ్రి లబోదిబో మన్నాడు. కొడుకు జైలుకు వెళ్తే నాలుగు లక్షల కట్నం పోతుంది. పులిరాజుతో బేరం పెట్టాడు. ఓనరు తనకు బరువు చేటుగా ఉన్న ఓ డొక్కు బండీ పులిరాజుకు ముట్టజెప్పాడు. పులిరాజు జైలుకు పోయి ఆరు నెలల క్రితమే వచ్చాడు. బండి బాగుచేయించుకుని బ్రతుకుతున్నాడు. మొన్ననే మద్రాసెల్లి లోడ్ అన్‌లోడ్ చేసి వస్తుండగా దార్లో ఎక్కిన బొర్రకడుపు పాసింజర్ దగ్గర పదివేలున్నట్టు పసికట్టే వాడ్ని కళ్లు మూసి జెల్లకొట్టి దోచుకున్నాడు. మద్రాసు సరిహద్దు దాటగానే ఒరిజినల్ నంబరు ప్లేట్ తగిలించి వస్తూండగా మళ్లీ ఈ గండమా....!

రెండు వేలు వదిలించుకుని బయటపడ్డాడు పులిరాజు.

సింవాచెలం బండిని వెనక్కి తిప్పాడు. అది సగం దార్లోనే దారి మళ్లింది.

సెంద్రిపాలెం సెంద్రమ్మ ఊళ్లోకి మొదట వచ్చినవాడు సింవాచెలం. తర్వాత వచ్చినవాడు 'సూరినారాయణ' దేవుడు.

కళ్లాపి చల్లడానికి వచ్చిన చెంద్రమ్మ వరస చెల్లి వరుగున వెళ్లి అక్కకు కితకిత పెట్టింది. లేచి లెంపకాయ కొట్టబోతున్న చెంద్రమ్మ చేతుల్ని సుతారంగా అడ్డుకున్నాడు అప్పుడే వచ్చిన సింవాచెలం. నా పనయిపోయిందని వెళ్లిపోయింది చెల్లి.

చెంగ తుడిచి 'నిద్ర మొకమ్మీద' ముద్దుపెట్టాడు సింవాచెలం.

"సీ... ఎదవకంపు...!" అనాలనుకున్న చెంద్రమ్మ నోరు మూతపడింది సింవాచెలం జోబీ 'కడుపు'తో ఉండటం చూసి.

చెంద్రమ్మ రయ్యిన లేచింది. మూడు పొయ్యిలు రాజేసింది. సురుకెండకు ముందే వేడి నీళ్లు, ఉప్మా పెసరట్టు, 'బురూ' కాఫీలు సిద్ధం చేసింది. 'మద్దేనేల'కు గారెలు చేసింది. నంచుకు నల్లకోడి మెడ కోసింది ... తీపికి 'పరవాణ్ణం' వండింది. జగ్గులు గాడికి కబురెట్టి రెండు 'సీసాకాయల్ని' తెప్పించింది.

అన్నీ సిద్ధమయ్యాయి. తొలి నిద్రా అయ్యింది!

చెంద్రమ్మతో తొలి 'తొలి నిద్ర' చేసిన మగోడు ఎక్కడున్నాడో తెలీదు. సింవాచెలం మాత్రం గతార్నెలల నుంచీ 'మూడు నిద్రల' మొగుడు!

రెండో నిదరకు నీలుగుతున్న సింవాచలెం మీద చిరాకయిపోయింది చెంద్రమ్మ.

"సీ... సీ... ఎప్పుడూ నిద్దరా ... నిద్దరే ... నిద్దరయితే తిండీ .... బుడ్డీ ... సీ...సీ....! గాజులు తెస్తానన్న మగోడివేనా నువ్వు?" ఛీత్కరించింది.

సింవాచెలం చింతపిక్కల డబ్బాకింద పడినట్టు నవ్వాడు.

"ఎర్రిదానా! నువ్వసలు ... నువ్వసలు ...!" అని ఆ అసలేమిటో చెప్పకుండా మింగేసి మళ్లీ నవ్వి అన్నాడు "సీ... ఎవులేనా నిద్రమొకంతోనే మేకప్పులు సేసుకుంటారా ...! రా, రా... ఇంకా బోల్డు టైంవున్నాది....!" చెయ్యి లాగి కన్ను గీటాడు. సూరీడు సిగ్గుపడి కొండమాటుకు పోయాడు. రాత్రి రెండో ఝాముపుతుండగా మూడో నిద్ర కానిచ్చి వేగుచుక్క వేళకు బలవంతాన లేచి బయటపడ్డాడు.

బయటపడబోతున్న సింవాచెలాన్ని కసిగా గిచ్చింది చెంద్రమ్మ.

"సీ...సీ.... నీ బతుకింతే! ముష్టి మూడొందలెట్టి పోడానికేనా వచ్చింది!" కచ్చిగా కసురుకుంది. అవి వెనకగా వినబడుతున్నాయి సింవాచెలానికి. కానీ మూతి తిప్పుకుని చూపుడు వేలు తాటిస్తున్న చెంద్రమ్మ సింవాచెలానికి కనబడలేదు.

హైరోడ్డు జంక్షను కొచ్చిన సింవాచెలం మళ్లా ఉలిక్కిపడ్డాడు! చెంద్రమ్మతో 'నిద్దర'మత్తూ, సీసాలకైపూ ఒక్కసారిగా వదలి పారిపోయినాయి. తడుముకుంటున్న చేతులకు 'బొత్తి' తగలడంలేదు.

అమ్మ సెంద్రిముండా! మొత్తానికే ఎసరెట్టావే .. నీ తల్లి .... సింవాచెలం గుండె లబ్‌డబ్‌లకు బదులుగా మన్మథభాష నందుకుంది. అప్రయత్నంగానే రంయ్యిన ఆటో వెనుతిరగబోయింది. తిరగబోతూ సడెన్‌గా ఆగిపోయింది! సింవాచెలం గుండె ధడ్‌మని శబ్దం చేస్తూ ఆగిపోయింది!

మళ్లీ కొట్టుకున్నప్పుడు ఆ దృశ్యం స్పష్టమయింది. ఆ వచ్చేది ... నీలం రంగు జీపు ... రాక్షసిలా ముందుకు దూసుకుని వచ్చేస్తోంది!

జీపులోని వాళ్లని చూస్తూనే తన 'కొడుకులు'గా దీవించాడు సింవాచెలం.

ఈళ్లిప్పుడియ్యాల ఇందంట ఎందుకు తిరుగుతున్నట్టో ... కొంపతీసి ఈళ్ల కస్సలెవ్వారం రట్టయిపోలేదు కద.... సింవాచెలం అప్రయత్నంగానే బండిని ఎదుటి రోడ్డుకేసి తిప్పబోయాడు. అలా తిరగనివ్వకుండా సింవాచెలం దీవించిన 'వాళ్లు' దిగి అడ్డుకున్నారు.

000

శవం కేసులో లాకప్పులో ఇరుక్కున్న సింవాచెలాన్ని 'కప్పు' తీయించి విడిపించాడు సింవాచెలం ఓనరు దయానిధయ్య.

'కప్పు' తీయించినందుకు అయిదువేలు, ఆర్రోజులు ఆటో తిరగనందుకు నష్టం మరో వెయ్యి పోయినందుకు తనను ముప్ఫయి తిట్లు అరవై తన్నులతో శుద్ధి చేయించిగానీ వదలడని భయపడ్డ సింవాచెలం తేలిగ్గానే నిట్టూర్చాడు

"ఒరేయ్, సిమ్మా! బుద్ధిగా మనుసుల్నే టాన్స్‌పోర్ట్ చెయ్యిగానీ, ఇట్టా సెవాల్ని చెయ్యమాక!" అన్న హితవుతో తన భుజం తట్టినందుకు.

ఆ రోజునే గత వారం కాశీ వెళ్లి తెచ్చుకున్న గంగాజలంలో కాస్త మిగిలి ఉంటే, దాంతో ఆటోని శుద్ధి చేయించి సింవాచెలానికి అప్పగించాడు.

ఓనరు మంచి మనుసుకి పొంగిపోయిన సింవాచెలం వంగి ఓనరు కాళ్లకు దండం పెట్టబోతుండగా భుజాల్ని పట్టి లేవదీశాడు దయానిధయ్య.

"ఒరే, సిమ్మా! మన్లాటోల్లందర్నీ ఆడించేదీ ... ఆపించేదీ అన్నీ ఆ పైనున్న భగమంతుడేరా ...! ఆయనకెట్టు దండం... అసలియన్నీ ఆడి లీలలేరా ... మనమెవలం ... మట్టిబొమ్మలం ... ఎల్లు ... ఎల్లి జాగర్తగ బతుకు! ఆఁ, అన్నట్టు సూడొరే సిమ్మా... ఈ కాయితాల మీద ఓ సిన్న సంతకమిలా గిరికేసి పో!" కాగితాలు తీసి చూపించాడు దయానిధయ్య.

"ఏటి బాబూ ...?" వాటిని ఆశ్చర్యంగా చూశాడు సింవాచెలం.

"మరేం లేదులేరా, సిమ్మా! ఆ కొండోర్న నీకో ఎకరం భూమి దఖలయి వున్నాది కదా! అందెందుకూ పనికిరాదని నీవే ఓసారి సెప్పావు. ... అది నీ కర్సులకని అమ్మేస్తున్నట్టు ఓ సిన్న సంతకం!"

"బాఁవుగారూ!"

"పోలీసోళ్లు కేసులు, కోర్టులంటే మాటలేంట్రా సిమ్మా ... మూటలు ... మూటలుండాల! మరవన్నీ నేను సూసుకోవాల ... మల్ల నీ బండి నీవు సలచ్చనంగా తోలుకోవాల! ఇయన్నీ వొద్దంటే అమ్మక. తర్వాత తక్కువలో తక్కువ ఆర్నెల్లూ..... మరి పెళ్లికెదురు సూస్తన్న నీ సెల్లి సంగతేమో ఇంతే సంగతులు... ఏటంటవ్? ఆలోసించుకో ... బలవంతమేమీ లేదు!" దయానిధయ్య అక్కడ్నించి లేచి వెళ్లిపోయాడు.

అయిదే అయిదు నిమిషాల్లో సింవాచెలం సంతకం చేసేశాడు.

సంతకం చేసి బయటికొచ్చాకగానీ సింవాచెలం గుండె కుదుట పడలేదు.

మరో మూడు నెలల తర్వాత-

"ఎంత మాట ... ఎంత మాట ... తమర్లాంటి పెద్దోళ్లు ... సాయంగా నా దగ్గిరకొచ్చి అడగడమూ, నేను లేదనడమా? రాములోరికి ఉడత సాయంలాగ నా సాయం తమకో లెక్కా సెప్పండి! అందుచేత నా సాయం తక్కువయినాదని మరోలా అనుకోరంటే, నా మనవేటంటే ... ఈ ... ఈ అయిదూ మన పార్టీకి సందా ...! ఇగబోతే, ఆ కొండవార్న భూమిసెక్క తమరి సిన్నబ్బాయి పేర్న దఖలు! బాబూ ... అది కొండవారదని అనుకోకండి ... ఆర్నెల్ల క్రితవే ఆ ఏరియాల పెద్ద ఇంటర్‌నేసనల్ ప్రోజెక్టు ఖరారయిపోయి ఉన్నాది. తమకా ఇసయం తెలుసు కదా! తక్కువలో తక్కువ ఇప్పుడే ఆ ఏరియాల్ల ఎకరాకి లచ్చన్నర పలుకుతున్నాది ..... ఇక తమరి దయ!" వినయంగా చేతులు జోడించాడు దయానిధయ్య.

దయానిధయ్య పైన 'దయ' చూపించడం జరిగిపోయింది.

పార్టీ టిక్కెట్టొచ్చేసింది. ఆ తరవాత ఎన్నికలొచ్చేసినాయి. ప్రముఖ భూస్వామీ, వ్యాపారవేత్త ప్రజాసేవకు నడుం కట్టుకుని రాజకీయాల్లోకి 'దిగి'పోయాడు.

పేదల పెన్నిధీ ... బడుగువర్గాల ఆశాజ్యోతీ ... పీడిత తాడిత దళిత వర్గాలకు ఆపద్బాంధవుడుగా కీర్తించబడుతూ దయానిధయ్యగారు ఊపిరి తీసుకోకుండా ఉన్నారు 'ప్రజాసేవ'లో! ■

